# పరిణామం ::

శ్రీ నండూరి ఈశ్వరం

కాలేజీనుంచి వస్తూ కారును గారేజిలో పెట్టి మేడ మెట్లెక్కుతోంది ప్రభాతదేవి. తండ్రి రమేశబాబు నవ్వుతూ యెదురువచ్చాడు.

"ఎవరమ్మా అక్కడ?"

ప్రభాతదేవి సవిలాసంగా వెనుదిరిగి చూచింది. మలిన మూర్తియగు నొక యువకుడు తల(వాల్చి మెట్ల(క్రింద నిలుచున్నాడు. చరచరా దిగి అతని వద్దకు వెళ్లింది.

"ఎవరు నువ్వు?"
"నేనా? నేను..."
"నీ పేరు?"
"శరన్మోహన శర్మ."
"ఏంపనిమీద వచ్చావు?"

శరన్మోహన్ తలఎత్తి ఆమె నొకసారి చూచి తలదించేసు కున్నాడు.

"ఉద్యోగం కోసం."
ఇంతలో రమేశబాబు కూడా వచ్చాడు.

"లోనికి రండి" అంటూ క్రిందనున్న ఆఫీసు రూములోనికి తీసుకుని పోయాడు.

పదిరోజులు గడచిపోయినాయి. శరత్ రమేశ బాబుకు గుమాస్తాగా కుదిరి పనిచేస్తున్నాడు. ఒక రోజున ప్రభాతదేవి అతని పిలిపించింది.

"ఈ చెక్కు బ్యాంకుకు తీసుకెళ్లి మార్చుకు రావాలి." అనిచెప్పి పంపింది.

అరగంటలో తిరిగి వచ్చాడు శరత్. ప్రభాత దేవి రెండు పదిరూపాయిల నోట్లు అతనికిచ్చింది. "గుడ్డలు కుట్టించుకోండి," అని మాట్లాడకుండా జేబులో వేసుకుని వెళ్ళిపోయాడు శరత్ ప్రభాతదేవికి కొంచెం కోపం వచ్చింది. ఒక్క కృతజ్ఞతా వాక్య మైనా అనలేదే?

మళ్ళా నాలుగు రోజులు గడచి పోయినాయి. ప్రభాతదేవి శరత్‌కు ఫోనులో చెప్పింది "మీరొకసారి రావాలి" అని. టైపుచేస్తూన్న వుత్తరాన్ని పూర్తిచేసు కుని వెళ్లాడు. టేబుల్ మీద పుస్తకాలన్నీ విరజిమ్మ బడి వున్నాయి, ఎదో యింగ్లీషు మాసపత్రిక చదు వుతూ కూర్చుంది ప్రభాతదేవి శరత్ రావటమే గమ నించలేదామె. పత్రిక ముఖపత్రంమీది స్త్రీ నగ్న సౌం దర్య చిత్రం అతన్ని చూచి నవ్వుతూంది.

"ఏమిటి చదువుతున్నారు?" ప్రభాతదేవి కను లెత్తి అతన్ని చూచింది.

"ఒక చక్కని కథ. అందంగావుందనుకున్నారు శరత్ అని ఒక యమ్. ఏ. చదువుకున్నాయన వ్రాశాడు. మీ పేరు కూడా అదే గావును! ఇంతకూ మీకు యిం గ్లీషు వచ్చునా?"

"ఏదో కొద్దిగా వచ్చునులెండి. మీరు తెనుగు పత్రిక లేవన్నా చదువుతారా?"

"తెనుగు? చప్పగా వుంటుంది. మానాన్న గారికి బెంగాలీ అంటే యిష్టం—ఆయన అసలుపేరు రామేశ్వర శర్మ. రమేశబాబు అని పేరుమార్చుకుని గెజిట్ నోటిఫికేషన్ చేయించుకున్నారు. వారు యిం గ్లీషంటే ప్రేమ. కొద్దిరోజుల్లో నా పేరుకూడామార్చు కుంటాను. 'లిల్లీ' అని పెట్టుకుందామని వూహ! బా వుందా?"

"పేరు మార్చుకుని వేయికోట్లు తగిలించుకున్నా సప్త సముద్రాల్లో మునిగినా తెనుగు తనం పోతుందా? ఎందుకు మీకీ వ్యామోహం! మీజాతి మీభాష మీ ఔన్నత్యం అన్నీ మరచిపోయి యెండ మావులకోసం పరువెత్తుతా రెందుకు? తర తరాలనుంచీ మీ వంశ రక్తంలో ప్రతిఫలిస్తూ వచ్చిన జాతి మత సాంప్రదా యాలన్నీ పేరు మార్చుకోవటంతో తుడిచి పెట్టుకుని పోతాయా? నవనాగరికతా పైశాచిక చక్రమాయా పరిభ్రమణంలో సుడి తిరుగుతూన్న మీరు అమృత మధురమైన మీ భాషనూ చైతన్యంకల మీ సాంప్రదా యలనూ యెలా గుర్తించుకో గలుగుతారు? ఒక్కసారి మీరు ఆ పూర్వాంధ్ర జాతీయతా మహోన్నవంక చూడండి. ఆనాడు దేశ దేశాలూ మీకూ మీభాషకూ మీ శిల్పానికీ మీ విజ్ఞానానికీ జోహారులు చేసినాయి. అంధకూపంలో దిగజారుతూ మిమ్మల్ని మీరే మరచి

పోతూన్నారు. వంశక్రమాగతమైన తెనుగు తనపు తేజస్సు మీ హృదయాంతరాంతరాల్లో యెక్కడో మిసుకు మంటూంది. ఆవరించిన చీకటి తెరలను చీల్చి ఆ తేజోవేశాన్ని బయటకుతీసి చూడండి... క్షమించాలి పిలువ నంపిన పని సెలవిస్తారా?" శరత్ తడబడుతూ ముగించాడు.

ప్రభాతదేవి ఆశ్చర్యంతో అతనివంక చూస్తుంది. ఇంతవరకూ ఆమె తన "సొసైటీ"లో నాగరికతకు అధునాతన భావాలకు పుట్టినిల్లని పేరుపొంది ప్రశంసింపబడిందేగాని యింత తిరస్కారాన్ని ప్రబోధాన్నీ పొంది యుండలేదు. శరత్‌ను పిలువనంపిన పని మరచిపోయింది.

"ఊరికేనే పిలిచాను:"

అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయాడు శరత్. కొంచెం సేపటిలో ఒక కుర్రవాడు ఆమెకొక తెనుగు కథల మాసపత్రికను యిచ్చి వెళ్లిపోయాడు.

"ఎవరు పంపారు?"

"శరన్మోహన శర్మగారు" అంటూనే వెళ్ళిపోయాడు.

ఉద్విగ్న హృదయంతో ముఖపత్రాన్ని చూచింది ప్రభాతదేవి. "శరన్మోహన శర్మగారి 'పతనం', హరిచంద్ర శాస్త్రిగారి 'జతనం' అంటూ సూచికవుంది. "పతనం" తీసి చదువటం ప్రారంభించింది ప్రభాతదేవి. నవనాగరికతా సువర్ణ శృంఖలలో బంధింపబడిన ఒక లేబ్రాయపు యువతి విషాదచరిత్ర కథారూపంగావుంది కొంచెం కోపంతో చదువటం ప్రారంభించింది.

కథ పూర్తి అయింది. ప్రభాతదేవి కనుగొలకుల్లోంచి రెండశ్రు బిందువులు పత్రికమీద పడ్డాయి. ఎదురుగా నిలుచున్న శరత్‌ను చూడలేదామె.

"ప్రభాతదేవిగారూ! అదేమిటండీ?" అంటూ వచ్చాడు శరత్, చేతిలో మనుచరిత్ర బల్లమీద పడేశాడు. ప్రభాతదేవి లేచి నిలుచుంది.

"అలా కూర్చోండి." అనిఒక కుర్చీ చూపింది.

"ఆ యం. ఏ. వ్రాసిన కథకన్నా మీ 'పతనం' వెయ్యిరెట్లు బావుంది. శరత్ నవ్వాపుకో లేక పోయాడు.

"ఆ యం. ఏ. ను నేనే" అన్నాడు.

"ఆ! మీరా! మీరు! యం. ఏ.!"

"అవును."

"మీరు...గుమాస్తాగా!..."

"అది యింగ్లీషు చదువుల ఫలితం!"

ప్రభాతదేవి శరత్ ముఖం ఒంక నిశ్చలంగా చూచింది. ఆ యింగ్లీషు పత్రికల్లో యెవరి రచనలు తన యభిమానాన్ని చూరగొన్నాయో! ఎవరిని తాను పవిత్ర ప్రేమ మయ విజ్ఞానమూర్తియని భావించిందో! ఎవరి దర్శనంకోసం యెవరి పరిచయంకోసం తాను తహతహలాడిపోయేదో! ఆ మధురమూర్తి...తన యెట్టయెదుట ...గుమాస్తాగా...

ఎవరిని గూర్చియుషోస్వప్నాలను పెంచుకున్నో ఆ ప్రేమమూర్తి...యితనేనా?

తెనుగు తనపు గర్వరేఖా మిలిత ముగ్ధ లజ్జారుణరాగ మామె కపోలముల నలము కొనినది;

"మీరు...నా..."

రోహిణీ చంద్రుడు తూర్పుననున్న నీలి మబ్బులను దాటివచ్చాడు.


## ఏజంట్లకు

జూన్‌లోవచ్చే

వార్షిక సంచిక

ఎన్నిప్రతులు కావలసింది.

ఏప్రిల్ 25-వ తేదిలోగా

మా కార్యాలయానికి వ్రాయగోర్తాం.

మేనేజర్,

కథాంజలి